


(ప్రారంభం)

*I am, because you are – African Proverb*

**మానవ శరీరం**

* మీ భోజనం మీ నోట్లోంచి మీ కడుపులోకి వెళ్ళడానికి ఏడు క్షణాలు పడుతుంది.
* ఓ మనిషి వెంట్రుక మూడు కిలోల బరువుని మోయగలదు.
* మనిషి తొడ ఎముకలు కాంక్రీట్ కన్నా బలమైనవి.
* మగవాడి గుండెకన్నా స్త్రీ గుండె వేగంగా కొట్టుకుంటుంది.
* ప్రతి మనిషి పాదంలో కనీసం కోటి బాక్టీరియాలు ఉంటాయి.
* లాలాజలంలో కరగని పదార్థం తాలూకు రుచిని నాలుక గ్రహించ లేదు.

ఫక్కున నవ్వి, ఆ వివరాలు ఇచ్చిన అమెరికా నించి వచ్చే ఆ మెడికల్ జర్నల్ 'జమ'ని పక్కన పడేసాడు త్రివిక్రం. 1883 నించి ఏడాదికి నలభై ఎనిమిది సార్లు ప్రచురించబడుతున్న జమ ఫుల్ ఫాం 'ది జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్.' ప్రపంచంలో అత్యధికంగా సర్క్యులేట్ అయ్యే మెడికల్ జర్నల్ అది.

అప్పటికే అతని టేబుల్ మీది ల్యాండ్ లైన్ మూడు సార్లు మోగినా, జమలో, హ్యూమర్ సెక్షన్‌లోని ఆ మెడికల్ బిట్స్ చదవడంలోని ఆసక్తితో త్రివిక్రం రిసీవర్ని వెంటనే ఎత్తలేదు. రిసీవర్ అందుకుని చెప్పాడు త్రివిక్రం.

"హలో. ది సీజ్ డాక్టర్ త్రివిక్రం స్పీకింగ్."

"హలో. ది సీజ్ డాక్టర్ త్రివిక్రమ్స్ మదర్ స్పీకింగ్" అవతల నించి నవ్వుతూ వినిపించిందో స్త్రీ కంఠం.

"హలో. అమ్మా! ఏమిటి?"

"లంచ్‌కి ఇంటికి వస్తున్నావా? లేక నిన్నటిలా ఆపరేషన్ అని ఎగ్గొడుతున్నావా?"

"లేదు. వస్తున్నాను. ఆపరేషన్ డ్యూటీ రేపు పడింది."

"ఐతే మనం ఇద్దరం కలిసి తిందాం. నాన్నగారికి పెట్టేసాను."

"సరిగ్గా నువ్వు వచ్చేసరికి అన్నీ మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చేసి ఉంచుతాను."

త్రివిక్రం సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతను అక్కడ చేరి రెండేళ్ళయింది. ఉస్మానియా యూనివర్శిటీలో యం.బి.బి.ఎస్ పూర్తి చేసుకుని అతను కర్ణాటకలోని మణిపాల్‌లో యం.ఎస్ చేసాడు. తర్వాత

బెంగుళూరులో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఏడాదిన్నరపాటు పని చేసాడు. స్వంత రాష్ట్రానికి రావాలని ఈ ఉద్యోగానికి అప్లై చేసాడు. అది రాగానే హైదరాబాద్‌కి తల్లిదండ్రులతో పాటు వచ్చేసాడు.

అతను లేచి వార్డ్‌లోకి వెళ్ళి, వివిధ పేషెంట్ల గురించి డ్యూటీలోని నర్స్‌కి మరోసారి సూచనలు ఇచ్చి బయటకి నడిచాడు. కార్ పార్క్‌లోని తన స్కార్పియో వేన్ ఎక్కి ఇంటికి బయలుదేరాడు. ఐదు నిమిషాల్లో పద్మారావు నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో వేన్‌ని ఆపి దిగి, లిఫ్ట్ ఉన్నా కూడా మెట్లెక్కి మూడో అంతస్థులోని త్రీ నాట్ ఫోర్ ఫ్లాట్‌కి చేరుకున్నాడు. ఎక్సర్ సైజ్ కోసం అతను మెట్లని వాడతాడు. డూప్లికేట్ తాళం చెవితో తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. బూట్లు వదిలి ఎదురుగా ఎల్ షేప్‌లో ఉన్న అహాల్లోకి నడిచాడు. అలికిడిని బట్టి తల్లి వంట గదిలో ఉందని గ్రహించాడు.

ముందుగా ఓ బెడ్ రూం గది తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. ఓ రాకింగ్ చెయిర్‌లో కూర్చుని కిటికీలోంచి బయటికి చూస్తున్న తన తండ్రి రాంప్రసాద్‌ని పలకరించాడు.

"హలో నాన్నగారూ."

ఆయన తల తిప్పి త్రివిక్రం వంక చూసాడు. కానీ బదులు పలకలేదు.

"భోజనం అయిందా?" ప్రశ్నించాడు.

"ఇంకా లేదు."

"ఎందుకాలస్యం చేసింది? ఫోన్‌లో మీకు పెట్టేసానని అమ్మ చెప్పింది? అమ్మని అడుగుతా ఉండండి."

రాకింగ్ చెయిర్‌ని ఊపి బయటికి వచ్చాడు త్రివిక్రం.

"అమ్మా నాన్నగారికి భోజనం పెట్టలేదా?" అడిగాడు.

"ఇంతసేపు ఆగుతానా? పదకొండున్నరకల్లా పెట్టేసాను. పెట్టలేదన్నారా?" నవ్వుతూ అడిగింది జనని.

"అవును"

"సరే. నువ్వు కూర్చో. ఇవాళ నీకు ఆపరేషన్ ఉంటుందని భయపడ్డాను."

"లేదు."

"ఇవాళ ఓ విశేషం ఉంది తెలుసా?" అడిగింది.

"ఏమిటి?"

"ఇవాళ"

"నీ పుట్టినరోజు. అదే కదా విశేషం?" నవ్వుతూ అడిగాడు త్రివిక్రం.

"ఓ! నీకు గుర్తుందా? మర్చిపోయావని అనుకున్నాను."

గిఫ్ట్ రేప్ చేసిన ఓ పాకెట్‌ని అందించి చెప్పాడు.

"మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే అమ్మా."

జనని దాన్ని అందుకుని చింపి అందులోంచి ఓ పుస్తకాన్ని బయటకి తీసి దాని టైటిల్‌ని చదివింది. 'టేల్స్ ఫర్ ది మదర్స్ హార్ట్.'

అట్ట తిప్పగానే దానిమీద త్రివిక్రం చేతి రాతలో ఓ వాక్యం ఉంది.

'నీకీ పుస్తకం అవసరం లేదని నాకు తెలుసు. కానీ నా చిన్నప్పుడు ఇంకా పిల్లల డైపర్స్ రాని రోజుల్లో నేను శుభ్రంగా ఉండటానికి నువ్వు పడ్డ కష్టానికి గుర్తుగా, - **నీ త్రివిక్రం.**'

అది చదవగానే జనని కళ్ళు క్షణకాలం తడి అయ్యాయి. చటుక్కున తన చేతిని కొడుకు చేతి మీదకి ఆప్యాయంగా పోనించింది.

"నువ్వు భోజనానికి పిలవక పోయినా ఇవ్వాళ వచ్చేవాడ్ని తెలుసా? అందుకే సర్జరీ డ్యూటీని రేపటికి మార్పించుకున్నాను." చెప్పాడు.

తర్వాత జేబులోంచి ఓ చిన్న పెట్టెని తీసి తల్లి కళ్ళముందు దాన్ని తెరిచాడు. అందులో మిలమిల మెరిసే ఎర్రరాయి ఉంగరం ఉంది.

"ఇదీ నీకు తీసుకు వచ్చిన అసలు గిఫ్ట్."

దాన్ని తల్లి కుడి చేతి ఉంగరం వేలుకి తొడుగుతూ చెప్పాడు.

"ఆ మధ్య ఏదో పత్రికలో చూసి బావుందని నేను నీకు చెప్పింది ఇదే కదూ?" సంభ్రమంగా అడిగింది జనని.

"అవునమ్మా! దాన్ని వెంటనే ఆర్డర్ చేసి తెప్పించాను. వారం క్రితమే హాస్పిటల్ ఎడ్రసుకి వచ్చిందిది."

దగ్గరితనాన్ని చంపేస్తుందని వాళ్ళ మధ్య థాంక్స్ సంస్కృతిని మొదటి నించీ జనని ప్రోత్సహించలేదు. కాబట్టి ఆవిడ థాంక్స్ చెప్పలేదు. అదే బయటి వాళ్ళకి థాంక్స్ చెప్పకపోతే ఆవిడ ఊరుకోదు.

"మీ నాన్నకి చూపించి వస్తా ఉండు." ఉత్సాహంగా లేచింది.

అల్జిమీర్స్ అనే మెదడుకి సంబంధించిన వ్యాధితో బాధపడే రాం ప్రసాద్‌కి తన భార్య తప్ప ఇంకెవరూ గుర్తులేరు. ఆవిడ వెంటే కొడుకు కూడా ఆ గదిలోకి వెళ్ళాడు. ఆవిడ్ని చూడగానే ఆయన మొహంలో వెలుగు.

"చూసారా? ఇవాళ నా పుట్టినరోజని త్రివిక్రం ఇది బహుమతిగా తెచ్చాడు" ఆ ఉంగరాన్ని చూపించి చెప్పింది.

"ఇవాళ నీ పుట్టినరోజా?"

"అవును."

"ఇతనెవరు?" త్రివిక్రంని చూసి అడిగాడు ఆయన.

"మన అబ్బాయి త్రివిక్రం."

"అలాగా? ఏరా? ఎలా ఉన్నావు?"

"బానే ఉన్నాను నాన్నా. మీరు?"

"బావున్నాను. ఎంతట?" అడిగాడు రాం ప్రసాద్ ఆ ఉంగరాన్ని చూస్తూ.

"ఇరవై నాలుగు వేలు" చెప్పాడు త్రివిక్రం.

"నువ్వెవరు?" త్రివిక్రంని చూసి మళ్ళీ ప్రశ్నించాడు ఆయన.

"మీ అబ్బాయి త్రివిక్రంని" నవ్వుతూ బదులు చెప్పాడు.

"అలాగా? బావున్నావా?"

"బావున్నాను నాన్నా. మీరు ఎలా ఉన్నారు?"

"బావున్నాను."

తల్లీ కొడుకులు ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చారు.

"మీ నాన్నకి నీ గురించిన ఒక్క సంఘటన కూడా గుర్తులేకుండా పోయింది." బాధగా చెప్పింది జనని.

"నాకు మాత్రం నాన్నగారి గురించిన మొదటి జ్ఞాపకం బాగా గుర్తుందమ్మా. నాకు ఓ పన్ను సగం ఊడింది. పూర్తిగా ఊడటానికి నేను చేసిన ఏ ప్రయత్నం ఫలించలేదు. నేను డేడీ దగ్గరకి వెళ్ళి దాన్ని చూపిస్తే ఆయన 'ఏదీ? చూడనీ' అని క్షణంలో దాన్ని నొప్పి కలగకుండా తీసేసారు. అప్పుడు నా వయసు ఐదు ఉండచ్చు."

"వచ్చే నెలే మీ నాన్నగారి పుట్టినరోజు."

"అరవై నాలుగు నిండుతాయి."

"నాన్నగారు నాలుగైదేళ్ళ క్రితం నించే చూడటానికి డెబ్బై పై బడ్డాయనలా కనిపిస్తున్నారు కదూ?"

"అవును. మొహంలో ముడతలు, తెల్ల జుట్టు వారికి వంశపారం పర్యంగా వచ్చాయి."

"ఒక్క అల్జీమర్సే కాకుండా ఇవీనా? తాతల నించి మంచి ఆస్థులే వచ్చాయి" త్రివిక్రం నవ్వాడు.

జనని ఇద్దరికీ అన్నం వడ్డించింది. ఇద్దరూ భోజనానికి ఉపక్రమించాక అడిగాడు.

"నాన్నగారికి వాక్కాయ పచ్చడి ఇష్టం కదా?"

"అవును. అందుకే మోండా మార్కెట్‌కి ప్రత్యేకంగా వెళ్ళి కొని తెచ్చి చేసాను. కందిపప్పుని వేయించి వండితే, ఆ పప్పులో ఈ పచ్చడిని కలుపుకుని తినడం ఆయనకి ఇష్టం."

"అలాగే ఇష్టంగా తిన్నారా?"

"అవును."

కొద్ది క్షణాల తర్వాత చెప్పింది జనని.

"ఇవ్వాల్టికి అయిదో రోజున మీ తాతగారి పుట్టినరోజు."

"ఎవరు? ఢిల్లీ తాతా?"

"కాదు. కాశీ తాత పుట్టిన రోజు."

త్రివిక్రం తండ్రికి తండ్రి, త్రివిక్రం చిన్నప్పుడు ఢిల్లీలోని సెక్రటేరియట్‌లో పని చేసేవాడు. ఆయన ఢిల్లీలో ఉన్నాడని తెలిసిన త్రివిక్రం ఆయన్ని 'ఢిల్లీ తాత' అని సంబోధించేవాడు. అలాగే తల్లి జనని తండ్రి పార్థసారథి కాశీ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. కాబట్టి ఆయన్ని 'కాశీ తాత' అని పిలిచేవాడు.

కొద్దిక్షణాల తర్వాత అడిగాడు త్రివిక్రం.

"మీ పెళ్ళి ఆగష్టులో అయింది కదమ్మా?"

"బానే గుర్తుందే నీకు? రెండో శ్రావణ శుక్రవారం రోజు అయిందది."

"మీ పెళ్ళి గురించి ఏదో చెప్పావు? నాకు చూచాయిగా గుర్తుంది. మళ్ళీ చెప్పు." ఆసక్తిగా అడిగాడు త్రివిక్రం.

"అదా? మీ కాశీ తాతయ్య నాన్న, అంటే నా తాతయ్య తను పోవడానికి పదిరోజుల ముందు మా నాన్నని పిలిచి చెప్పాడు. 'ఒరేయ్! జననికి ఎవర్ని చేసుకోవాలని ఉంటే వాళ్ళకిచ్చి చెయ్యి తప్ప నువ్వు దాని పెళ్ళి సెలక్షన్‌లో వేలు పెట్టకు. జనని నీకన్నా తెలివికలది, చదువుకున్నది. కనుక అది దాని వదులు.' దాన్ని మా నాన్న తు.చ తప్పకుండా పాటించారు. అప్పటికి ఇంకా ఇంటర్నెట్ రాలేదు. ఇప్పటిలా మేరేజ్ డాట్ కాంలు, మ్యారేజ్ బ్యూరోలు లేవు. పెళ్ళిళ్ళ పేరయ్యలే సంబంధాలు తెచ్చేవారు. మా తాతయ్య నన్ను పిలిచి నాకు నచ్చిన సంబంధాన్ని నన్నే సెలక్ట్ చేసుకోమన్నారు. నాకు మీ నాన్న సంబంధం నచ్చిందని మీ తాతయ్యకి చెప్పాను."

తల్లి చెప్పేది ఆసక్తిగా వింటూ భోజనం చేస్తున్నాడు త్రివిక్రం.

"ఓ శుభ ముహూర్తాన మీ కాశీ తాతయ్య, మీ ఢిల్లీ తాతయ్య ఇంటికి వెళ్ళి నా సంబంధం గురించి చెప్పారు. కొద్దిసేపు మాటలయ్యాయి. మన స్వగ్రామం బాపట్ల దగ్గర అని తెలిసి అడిగాడు ఢిల్లీ తాత, 'అక్కడ త్రివిక్రమరావు అనే అడ్వకేట్ ఉండేవారు. ఆయన తెలుసా?' తర్వాత అడిగారు. ఆయన ఎవరో కాదు. స్వయంగా నా తాతయ్యే. ఆ సంగతే చెప్పారు మీ నాన్నగారు."

"ఓ! ఢిల్లీ తాతయ్యకి మీ తాతయ్య త్రివిక్రమరావు ముందే తెలుసన్నమాట"

"అవును. ఎలాగో చెప్తా విను. ఇదే ఇంట్రెస్టింగ్ విషయం. మీ ఢిల్లీ తాతయ్య నాన్నకి మా తాతయ్య త్రివిక్రమరావుతో చిన్నప్పటినించి బాగా స్నేహం. ఇద్దరూ కలిసి కొంత కాలం ఒకే చోట టైప్ నేర్చుకున్నారు. ఆ పరిచయం వారిద్దరి జీవితాంతం నిలిచే ఉంది."

"ఓ!"

"మా నాన్నగారు ఎప్పుడైతే త్రివిక్రమరావు తన తండ్రే అని చెప్పారో ఆయన వెంటనే తమ పూజ గదిలోకి తీసుకెళ్ళి అక్కడున్న తన తండ్రి ఫోటోలో పక్కన నిలబడ్డ మనిషిని చూపించి 'ఈయనేనా మీ నాన్నగారు?' అని అడిగారు. మీ తాతయ్య అవునన్నారు. 'అయితే ఈ సంబంధం కలుపుకుందామండి' అని మీ ఢిల్లీ తాత వెంటనే అన్నారు. అప్పటికే మీ ముత్తాతలిద్దరూ పోయారు. ఏనాడూ మీ ముత్తాత మీ తాతకి గాని, మా తాత మా నాన్నకి గానీ మీ నాన్న రాంప్రసాద్‌కి, నాకు పెళ్ళి చేయమని చెప్పలేదు."

"చాలా చిత్రంగా ఉందే?" తినడం ఆపి ఆశ్చర్యంగా చెప్పాడు త్రివిక్రం.

"అవును. అది వాళ్ళ మనసుల్లోనే ఉంది. తమ కొడుకుల మీద తమ ఇష్టాన్ని వారిద్దరూ రుద్దదలచుకోలేదు. ఓసారి మా నాన్న తన తండ్రికి వచ్చిన పాత ఉత్తరాలు చదువుతూంటే తన మనవడు రాంప్రసాద్‌ని నాకిచ్చి చేయాలన్న తన సంకల్పాన్ని రాయడం మా నాన్న చదివాడు. కానీ ఈ రాంప్రసాద్ ఎవరో, ఆ ఉత్తరం రాసిన ఆయన ఎవరో అంతుపట్టలేదు. మొత్తానికి ఆ రాం ప్రసాద్ సంబంధమే అలా వెతుక్కుంటూ రావడం మా నాన్నకి ఆనందాన్ని ఇచ్చింది. ఇంక రెండు వైపుల వాళ్ళ పూర్వాపరాల గురించి ఎంక్వైరీ చేసే బాధ తప్పిందనుకున్నారు. పెళ్ళిచూపులు ఏర్పాటు చేసారు. మేం ఒకరికొకరం నచ్చాం అని చెప్పాక ముహూర్తాలు పెట్టించారు."

"ఇంత మంచి పెళ్ళి కథ ఉందా మీకు?" మెచ్చుకుంటూ చెప్పాడు త్రివిక్రం.

"ఆ ఇద్దరి ఆత్మలే మా పెళ్ళయ్యేలా దీవించాయని మీ ఢిల్లీ తాత నమ్మకం. మా ఇద్దరి మధ్యా తొమ్మిదేళ్ళ వయసు తేడా ఉన్నా అదృష్టవశాత్తూ ఎలాంటి పొరపచ్చాలు లేకుండా ఎంతో సుఖంగా జీవిస్తున్నాం. అందుకు ఆ పెద్దలు ఇద్దరి ఆశీర్వాద బలం మామీద ఉందనే మీ నాన్నగారి నమ్మకం."

ఇద్దరి భోజనాలు అయ్యాక చెప్పింది జనని నవ్వుతూ.

"మా పెళ్ళి కథ గురించి అయింది. ఇక నీ పెళ్ళి కథ గురించ్చి మాట్లాడదాం."

"నాకింకా ముప్పై అయినా రాలేదుగా అమ్మా."

"అది వచ్చేదాకా ఇంకో రెండేళ్ళు దేనికి ఆగడం? 'వివాహం విద్యనాశాయ' అనటానికి ఇంకా నీకు చదువు కూడా అడ్డంకి లేదుగా? మేం ఉండగానే నీ పెళ్ళి చేసే మాకు నిశ్చింత."

"మీ ఇద్దరూ ఇంకా కనీసం ఇరవై ఏళ్ళుంటారు. భారతీయుల సగటు ఆయుర్దాయం డెబ్భై నాలుగుకి పెరిగింది అని ఇందాకే ఓ మెడికల్ జర్నల్‌లో చదివాను."

"నీ మనసులో ఎవరైనా ఉన్నారా?" అడిగింది జనని.

జవాబు చెప్పలేదు త్రివిక్రం.

"నిన్నో ప్రశ్న అడిగాను. యస్ ఆర్ నో తో చెప్పగలిగే జవాబు అది చిన్నప్పటినించే నిన్ను నేను కాని, మీ నాన్న కాని ఏదైనా ప్రశ్న అడిగితే యస్, నోలతో తక్షణం జవాబు చెప్పే అలవాటు చేసి ఉండాల్సింది అని ఇలాంటప్పుడు నాకు అనిపిస్తూ ఉంటుంది. 'విక్కీ నీ బొమ్మలన్నీ నేల మీంచి ఏరు' అని నేనంటే, 'యస్' అని నువ్వు జవాబు చెప్పే శిక్షణని ఇవ్వాల్సింది. ఇందువల్ల నీ బ్రెయిన్‌లోని పాజిటివ్ సైడ్ ఏక్టివ్‌గా మారి, ఇలా నిశ్శబ్దం అనే నెగిటివిటీ విభాగం ఏక్టివ్‌గా ఉండేది కాదు. చెప్పు. నీ మనసులో ఎవరైనా ఉన్నారా?"

"లేరమ్మా"

"ఆనెస్ట్?"

"ఆనెస్ట్. అంటే ఒకరిద్దరు ఉన్నారనుకో. కానీ సీరియస్‌గా ఎవరూ లేరు."

"పోనీ లైట్‌గా ఎవరున్నారో చెప్పు." నవ్వుతూ అడిగింది.

"నాకు ఇంకా ముప్పై రాలేదు కదమ్మా? నాన్నగారు ముప్పైకి కాని పెళ్ళి చేసుకోలేదుగా?"

"ఆచారం మార్గదర్శిగా ఉండాలి కానీ జైలులా ఉండకూడదు." చెప్పింది జనని నవ్వుతూ.

జనని సెల్ ఫోన్ మోగింది. ఆవిడ దాన్ని ఆన్ చేసి చెప్పింది.

"హలో?"

అవతలి వైపు వాళ్ళు చెప్పేది విని చెప్పింది.

"అలాగే. ఇవాళ కుదరదు. రేపు వస్తాను."

"...."

"అలాగే. ఉదయం మా అబ్బాయి హాస్పిటల్‌కి వెళ్ళగానే పదింటికి వెళ్దాం."

సెల్ ఫోన్ ఆఫ్ చేసింది. ప్రశ్నార్థకంగా చూసే కొడుకుతో చెప్పింది.

"తిరుమలాంబగారు. షాపింగ్‌కి తోడు రమ్మని ఫోన్. వారమ్మాయికి అమెరికాకి ఏవో కొని పంపాలిట. రేపు వస్తానన్నాను."

"ఎలా ఉందిట? కనక కదా ఆ అమ్మాయి పేరు?"

"అవును. కనకలక్ష్మి. న్యూజెర్సీలో ఉంటుంది. ఏదో ఊరి పేరు చెప్పింది కానీ గుర్తులేదు. కనక మరిది వెళ్తున్నాడట. అతని వెంట జీడిపప్పు పాక, అప్పడాలు, లేపాక్షి బొమ్మలు, కాటన్ చీరలు, ఇంకా ఇలాంటివే ఏవో కొని పంపాలిట."

"రేపు నిన్ను వాళ్ళింట్లో డ్రాప్ చేసి వెళ్ళనా?"

"ఆవిడే పికప్ చేస్తుందిట. నాన్నగారిని వంటరిగా వదిలి వెళ్ళలేను కదా. సుభద్రని మనింట్లో ఉంచి వెళ్దామంది."

"సుభద్ర అంత మంచిది కాదమ్మ. వాళ్ళాయనతో పోట్లాడి పుట్టింటికి వచ్చేయడమే కాక, అతని మీద పోలీస్ రిపోర్టు కూడా ఇచ్చింది"

కొడుకు మాటలకి అడ్డుపడుతూ చెప్పింది జనని.

"ప్రపంచంలోని ప్రతీ వ్యక్తీ మంచి చెడుల కలయికే. ప్రతీ మంచి వ్యక్తిలో ఎన్నో దోషాలు ఉంటాయి. అలాగే ప్రతీ చెడ్డ వ్యక్తిలో ఎన్నో మంచి గుణాలు ఉంటాయి. ఈ లోకంలో పూర్తి చెడ్డవాడు కానీ, లేదా పూర్తి మంచివాడు కానీ ఎవరూ ఉండరు. మన ఎదుగుదల కోసమే ఇతరులలోని మంచిని గుర్తించి చెడ్డని పట్టించుకోకూడదు. ఇతరుల నించి నువ్వు ఏదైనా నేర్చుకోవాలనుకుంటే, అది మంచి తప్ప చెడు కాకూడదు."

తన తల్లి ఎప్పుడూ ఎవరి గురించైనా ఇలాంటి సానుకూల మాటలే చెప్తుందని త్రివిక్రంకి తెలుసు.

"నీకు నచ్చిన ఓ మనిషి గురించి ఎందుకు నచ్చడో ఆలోచించు. పిసినారితనం, అతి వాగుడు, మన టైంని పాడు చేయడం.. ఇలా ఏదో ఒకటి లేదా రెండు దుర్గుణాల వల్ల మొత్తం మనిషిని చెడ్డవాడు అనుకుంటాం. అది తగదు. వాటిని విస్మరించి వారిలోని సుగుణాలని చూడగలగాలి."

"కరక్టే. నువ్వు చెప్పేదాన్లో ఎప్పుడూ ఆక్షేపణ ఉండదు"

భోజనం అయ్యాక త్రివిక్రం ఆ త్రిబుల్ బెడ్ రూం అపార్ట్‌మెంట్‌లోని తన బెడ్‌రూంలోకి వెళ్ళాడు. ఎదురుగా గోడమీద ఉన్న ఫ్రేమ్ చేసిన ఓ కొటేషన్ని చదివాడు. దాన్ని అతనికి స్కూల్లో నైన్త్ చదివేప్పుడు తండ్రి విలువని తెలియచేసే డిబేట్‌లో పాల్గొన్నందుకు బహుమతిగా ఇచ్చారు.

A man can be a father but it takes someone to be a dad

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments